శిథిలావస్థలో షట్టర్లు.. అన్నదాతల అవస్థలు

- మరమ్మతులకు నోచుకోని గుంటూరు ఛానల్ కాల్వల షట్టర్లు
- ఖరీఫ్ సమీపిస్తున్నా స్పందించని అధికారులు
- ఉన్నతాధికారులను కలసి ఫిర్యాదు చేసినా స్పందన కరువు


గోళ్లమూడి రోడ్డులో తుప్పపట్టి ధ్వంసమైన గుంటూరు ఛానల్ షట్టర్లు


పెదకాకాని లిఫ్ట్ సమీపంలో గుంటూరు ఛానల్‌పై శిథిలావస్థకు చేరిన వంతెన


దుక్కులు దున్ని నీటి రాక కోసం ఎదురు చూస్తున్న పొలాలు

పెదకాకాని: సాగునీటి సరఫరాలో అత్యంత కీలకమైన షట్టర్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాగునీటిని ఎగువ భూములకు తరలించాలన్నా, దిగువ భూములకు సక్రమంగా నీరు అందించాలన్నా షట్టర్లు ఎంతో కీలకం. పెదకాకాని మండలం గుండా ప్రవహిస్తున్న కాలువలకు ఏర్పాటు చేసిన షట్టర్లు మాత్రం మరమ్మతులకు నోచుకోవడం లేదు. పెదకాకాని మండలంలో ప్రధాన పంట వరి కావడంతో కాలువలపైనే ఆధారపడి రైతులు సాగు చేస్తున్నారు. మండలంలో ప్రవహించే గుంటూరు ఛానల్(కొత్తకాలువ), పాత కాలువలకు, కాలువల పొడవునా ఏర్పాటు చేసిన షట్టర్లు తుప్పుపట్టి శిథిలావస్థకు చేరాయి. ఈ కాలువల పొడవునా బ్రాంచి(పిల్లకాలువ) కాలువల ద్వారా నీరు పంట పొలాలకు సరఫరా అవుతుంది. పంట సమయం ఆసన్నమైనప్పటికీ షట్టర్ల నిర్వహణ మాత్రం చేపట్టడం లేదు. దీంతో నీటి నియంత్రణకు అవకాశం లేకుండా పోతుంది. నీరు వృథాగా మురుగు కాలువల్లోకి చేరుతుంది.

శివారు భూములకు నీటి లభ్యత గగనం

షట్టర్లు ఎక్కడికక్కడ శిథిలం కావడంతో కాలువ శివారు భూములకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. కాలువ చివరి ఆయకట్టు భూములకు నీరు అందడం లేదని గగ్గోలు పెట్టడం రైతుల వంతు అవుతుంది. నీటి నియంత్రణ లేకపోవడంతో అవసరమైన సమయానికి పంటకు నీరు అందదు. భారీ వర్షాలకు పంట మునిగిపోయి పైరు దెబ్బతింటుంది. ఈ ఖరీఫ్ నుంచైనా పంటకాలువలకు షట్టర్‌లు ఏర్పాటు చేసిన నీటిని నియంత్రించడం ద్వారా చివరి భూములకు నీరు అందించడం సులువు అవుతుంది. మండలంలోని పెదకాకాని, నంబూరు, గోళ్ళమూడి, తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, దేవరాయబొట్లవారిపాలెం, తంగెళ్ళమూడి, అనుమర్లపూడి గ్రామాల్లో వరిపంట సాగు చేస్తున్నారు. షట్టర్‌లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

సాగునీటి సరఫరాలో ఏటా ఇబ్బందులే..



నీటి రెగ్యులేషన్ జరగాలంటే షట్టర్లు పటిష్టంగా ఉండాలి. ప్రస్తుతం అన్నీ తుప్పు పట్టి ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో షట్టర్లు కూడా అసలు లేవు. దీంతో రైతులు ఏటా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా గుంటూరు ఛానల్(కొత్తకాలువ), హైలెవల్ ఛానల్(పాత కాలువ)ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలి.

– తాడిబోయిన వేణుగోపాలరావు, పెదకాకాని, రైతు

మరమ్మతులు చేపట్టాలి..



పంట పొలాలకు సక్రమంగా సాగునీరు అందాలంటే కాలువపై ఉన్న షట్టర్లు ఎంతో ముఖ్యం. కానీ వాటిని అధికారులు పట్టించుకోవడం లేదు. దాదాపు 15 సంవత్సరాలుగా ఈ షట్టర్లు మరమ్మతులకు నోచుకోలేదు. కాలువలు వదిలినప్పటి నుంచి నియంత్రణ లేకుండా బ్రాంచి కాలువలకు వెళ్లిపోతున్నాయి. భారీ వర్షాలు పడినపుడు ఆ నీరు ఎక్కువై వరదలు వచ్చి పైరు దెబ్బతింటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి షట్టర్లకు మరమ్మతులు చేపట్టాలి.

– అవుతు బ్రహ్మారెడ్డి, నంబూరు, రైతు

క్లుప్తంగా

26న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీన ఎంపీపీ దాసరి అన్నమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.శివపార్వతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

పొన్నూరు: నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్లో శనివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సభకు ఎంఈఓ–2 కె. విజయభాస్కర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 చలపతి రావు, హెచ్‌ఎంలు శివలక్ష్మీ, వైఎస్‌టీ సాయి, జయరాజు, అనురాధ, మహబూబ్ బాషా, నిర్మల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. అయితే పాఠశాలలు ప్రారంభమై రోజులు గడుస్తున్నా ఇంకా మండలంలో పూర్తిస్థాయిలో విద్యార్థులకు పుస్తకాలు అందజేయక పోవడంపై తల్లిదండ్రుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మహిళ ఆత్మహత్య

పొన్నూరు: మండల పరిధిలోని దొప్పలపూడి గ్రామంలో మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అరుణ భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటోంది. ఈక్రమంలో తన ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే గ్రామంలో వరుస ఆత్మహత్యలతో కలకలం రేగింది. గ్రామానికి చెందిన చిన్న కోటయ్య శుక్రవారం ఉరేసుకుని చనిపోయిన సంఘటన మరువకముందే మరో మహిళ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

ఆర్డీ కార్యాలయ సూపరింటెండెంట్లుగా సత్యం, రామకృష్ణ

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ, వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం సూపరింటెండెంట్లుగా గుంటూరు మలేరియా ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న డి.సత్యం, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో పనిచేస్తున్న ఎస్.రామకృష్ణ శనివారం విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా శుక్రవారం వీరు ఆర్డీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆర్డీ కార్యాలయంలో సూపరింటెండెంట్లుగా పనిచేస్తున్న షేక్ నాగూర్ షరీఫ్, గుంటూరు మెడికల్ కాలేజ్, గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్ బాపట్ల డీఎంహెచ్ సూపరింటెండెంట్ ఆర్డీ కార్యాలయం నుంచి రిలీవ్ అయి విధుల్లో చేరారు. గుంటూరు మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న ఆండ్రూస్ మంగళగిరి టీబీ శానిటోరియంలో, మంగళగిరి టీబీ శానిటోరియంలో పనిచేస్తున్న రమణ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో, బాపట్ల డీఎంహెచ్ఓ కార్యాలయంలో పనిచేస్తున్న రజాక్ గుంటూరు జిల్లా మలేరియా కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్లుగా విధుల్లో చేరారు.

మాట ఇచ్చి తప్పడం తగదు

తాడేపల్లి రూరల్: ఐటీ, విద్యాశాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు 200వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ఏసీసీ కార్మికుల సమస్య పరిష్కరించడం ప్రభుత్వానికి పెద్ద విషయం కాదరు. న్యాయస్థానాలు కార్మికులకు అనుకూలంగా తీర్పు లు వెలువరించినా అమలు చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదని, 33 సంవత్సరాలుగా అవుతున్నా కార్మికుల సమస్య పరిష్కారం కాకపోవడం విచారకరమన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేష్ నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. సీఐటీయూ నాయకుడు వేముల దుర్గారావు, ఏఐటీయూసీ నాయకుడు కె.వెంకటయ్య, వైఎస్సార్‌టీయూ నాయకులు శ్రీనివాసరాజు, ఐఎన్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) కార్మిక సంఘాల నాయకులు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, నాయకులు దొంతిరెడ్డి వెంకట రెడ్డి, కోట య్య, కె.వెంకటయ్య, కార్మికులు ఎం.గురవయ్యా, సూర్య ప్రకాష్, నాగేశ్వరరావు, అంకయ్య, ఇమాంబీ, దుర్గాభవాని, నవనీతమ్మ, రమణ, సారమ్మ, శారద, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్లకు వరాలు – పేదలకు శాపాలు' పుస్తకావిష్కరణ

తాడేపల్లి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏడాది పాలనా వైఫల్యాలపై సీపీఎం రచించిన 'కార్పొరేట్లకు వరాలు – పేదలకు శాపాలు' పుస్తక ఆవిష్కరణ శనివారం తాడేపల్లిలో జరిగింది. తాడేపల్లి పట్టణ పరిధిలోని క్రిస్టియన్‌పేటలో జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలను ఈ పుస్తకంలో పొందుపరిచామన్నారు. నాయకులు డీవీ భాస్కరరెడ్డి, వై.బర్నబాస్, బొబ్బిలి రామారావు, నీరుడు దుర్గారావు పాల్గొన్నారు.

నాద బిందువులు రెండో భాగం గ్రంథావిష్కరణ



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం రెండో వీధిలోని శ్రీత్యాగరాజ కళావేదికపై శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో శనివారం నాద బిందువులు రెండో భాగం గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు. సంఘ కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో జరగ్గా, నాట్య కళారత్న డాక్టర్ కాజా సుబ్రహ్మణ్యం సభాధ్యక్షత వహించారు. గ్రంథావిష్కరణకర్తగా కేంద్ర సంగీత నాటక అకాడమీ, సభ్యులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, గ్రంథకర్త, వేమూరి రామలక్ష్మి, శ్రీ త్యాగ రాజ సాంస్కృతిక సంఘం సలహాదారులు నేతి విశ్వేశ్వరరావు మాట్లాడారు. అనంతరం కాజా సుబ్రహ్మణ్యం శిష్యురాలు షన్విక గణపతి కౌతం రామ కోదండరామ కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. నాద బిందువులు రెండో భాగంలోని విశేషాలను వక్తలు వివరించారు. కార్యక్రమంలో భూసురపల్లి వెంకటేశ్వర్లు, నాట్యాచార్య బాలు, పెద్ది సాంబశివరావు, మోదుగుల రవికృష్ణ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రత్తిపాడు: మండల పరిధిలోని చినకోండ్రుపాడు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. దాత గడ్డిపాటి పద్మజా రాణి సహకారంతో పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఉచితంగా అందించారు.

ఊరూరా ఆనంద'యోగ'ం


కోయవారిపాలెం హైస్కూల్‌లో విద్యార్థుల యోగాసనాలు


పొన్నూరులో యోగాసనాలు వేస్తున్న ప్రజలు

ప్రత్తిపాడు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారులు ప్రత్యేక యోగ శిబిరాలను నిర్వహించారు. పెదగొట్టిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏపీఎం వి.లాజరు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యూనిస్, ప్రత్తిపాడు హైస్కూల్లో ఎంపీడీఓ కె.శివపార్వతి, తుమ్మలపాలెం సుప్రీం ఎల్‌టీసీలో సెక్రటరీ ఖాజాల ఆధ్వర్యంలో శిబిరాలు జరిగాయి. నియోజకవర్గం పరిధిలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు జరిగాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పొన్నూరు: పొన్నూరులో అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం ఉత్సాహంగా జరిగింది. ఉదయం నుంచి ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంధ సంస్థల్లో యోగాసనాలు నిర్వహించారు. పొన్నూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు నిర్వహణలో యోగాంధ్ర జరిగింది. పట్టణంలోని ప్రధాన రహదారిలో భారీస్థాయిలో వేదిక ఏర్పాటు చేసి ఎంతో ఆర్భాటంగా కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన రహదారిలో శుక్రవారం సాయంత్రం నుంచి ట్రాఫిక్‌ను మళ్లించి ఏర్పాట్లు చేయడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఉదయాన్నే ప్రారంభించిన యోగా కార్యక్రమంలో ఆశించిన స్థాయిలో ప్రజలు పాల్గొనలేదు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, అధికారులు, మెప్మా సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు. పొన్నూరు కోర్టు ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జి.రుక్మిణి ఆదేశాల మేరకు కోర్టు సూపరింటెండెంట్ అంబటి రాజ్యలక్ష్మి నిర్వహణలో యోగా వేడుకలు నిర్వహించారు. యోగా గురువులు కోట సాంబశివరావు, మోహనలక్ష్మీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీ సాహెబ్, మాజీ అధ్యక్షుడు పి. జయరాజ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పెదకాకానిలో..

పెదకాకాని: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు పెదకాకాని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయాల వద్ద ప్రత్యేకంగా యోగాసనాలు వేశారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లోనూ యోగా దినోత్సవం నిర్వహించి యోగా ద్వారా కలిగే ప్రయోజనాలను యోగ గురువులు, ఉపాధ్యాయులు వివరించారు.

పెదకాకాని లూథర్‌గిరికాలనీ గ్రంథాలయం వద్ద, నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి యూనివర్సిటీ, తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు యోగ దినోత్సవంలో పాల్గొని యోగాసనాలు వేశారు. యోగా ప్రాముఖ్యత వివరించారు.

చేబ్రోలులో..

చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని నారాకోడూరు జడ్పీ హైస్కూల్‌లో యోగా డే సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం ఏడుకొండలు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. మండల పరిధిలోని మంచాల, చేబ్రోలు, వేజండ్ల, గుండవరం, సుద్దపల్లి తదితర గ్రామాల్లో యోగా డే సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు.

కాకుమానులో..

కాకుమాను: యోగాతో మానసిక ప్రశాంతత, ఆనందం కలుగుతుందని ఎంపీడీఓ యుగకీర్తి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం యోగా దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ బి.వెంకటస్వామి, ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాంటీ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు


యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గుంటూరు రూరల్: ఈగల్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఐజీ ఆకె రవికృష్ణ ఆదేశాల మేరకు శనివారం నల్లపాడు పోలీసు స్టేషన్ లిమిట్స్‌లోని చౌడవరం గ్రామం వద్దనున్న బలరామకృష్ణ స్పిన్నింగ్ మిల్స్‌లో కార్మికులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. ఒడిస్సాకు చెందిన కార్మికులు సుమారు 300 మందికి డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈగల్ టీం విశిష్టత, మాదకద్రవ్యాల వినియోగం, వాటి దుష్పరిణామాల గురించి కార్మికులకు అవగాహన కల్పించారు. 1972 టోల్ ఫ్రీ నెంబర్ యొక్క ముఖ్య ఉద్దేశం గురించి వివరించారు. మాదకద్రవ్యాలు రవాణా చేసిన, అమ్మిన, కొనిన, సేవించిన, కలిగి ఉన్నా చట్టపరమైన చర్యలు తప్పవని. మాదకద్రవ్య చట్టాలు మరింత కఠినతరం చేయటం జరిగిందని ఈగల్ డిపార్ట్‌మెంట్ డీఎస్పీ సింగయ్య, నల్లపాడు సీఐ వంశీధర్‌లు తెలిపారు. మిల్ యాజమాన్యం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

గుంటూరు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్ సీట్ల కోసం ప్రవేశ పరీక్ష రాసి సీటు రాని విద్యార్థులకు, 6, 7, 8, 9 తరగతుల సీట్ల కోసం దరఖాస్తు చేసిన వారికి ప్రవేశ పరీక్ష ద్వారా మరో అవకాశం కల్పించనున్నట్లు అడవి తక్కెళ్లపాడు అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్ జి.ఆనందబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీన బాలికలకు సత్తెనపల్లి రామకృష్ణాపురంలో, 23వ తేదీన తాడికొండ గురుకుల పాఠశాలలో 5వ తరగతికి ఎంట్రన్స్ రాసి సీటు రాని బాలురు కౌన్సెలింగ్‌కు హాజరైతే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న బాలురు, బాలికల గురుకులాల్లో ఖాళీగా ఉన్న సీట్లను పొందవచ్చని తెలిపారు. 6,7,8,9, తరగతుల ప్రవేశాలకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని అంబేడ్కర్ గురుకులాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈనెల 25వ తేదీన తాడికొండ అంబ్కేర్ గురుకులంలో 6,7 తరగతులకు ఉదయం 10 గంటలనుంచి, 8, 9 తరగతులకు, మధ్యాహ్నం రెండు గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు గతంలో ఎంట్రన్స్ రాసి సీటు రాని విద్యార్థులకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి గుంటూరు అడవితక్కెళ్ళపాడు అంబేడ్కర్ గురుకులంలో ఈనెల 26వ తేదీన బాలికలకు, 27వ తేదీన బాలురకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారని, ఇప్పటికే సీటు రాని విద్యార్థులు ఈ కౌన్సిలింగ్‌కు హాజరైతే ఖాళీగా ఉన్న సీట్లను పొందవచ్చన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మూడు గేదెలు మృతి

ప్రత్తిపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని మూడు గేదెలు మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రావూరు పరమేశ్వరరావు, గోరంట్ల రత్తయ్య, మందలపు సాయిబాబులు తమ గేదెలను మేత కోసం శుక్రవారం బయటకు వదిలారు. అయితే ఎప్పటిలా గేదెలు రాత్రి ఇంటికి రాలేదు. శనివారం ఉదయం గుంటూరు – పర్చూరు పాతమద్రాసు రోడ్డుపై కోయవారిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకు సమీపంలో మృతి చెంది పడి ఉన్నాయి. విషయం తెలుసుకున్న పశుపోషకులు ఘటనా స్థలానికి చేరుకుని గేదెలు తమవేనని నిర్ధారించుకున్నారు. అనంతరం విషయం వీఆర్వో రాణికు తెలియడంతో ఆమె గేదెల యజమానుల నుంచి వివరాలను సేకరించి, స్టేట్ మెంట్ తీసుకున్నారు. మృతి చెందిన గేదెల్లో రెండు పాలు ఇచ్చే గేదెలు కాగా, ఒకటి చూడి గేదె అని పోషకులు చెబుతున్నారు. రెండు మూడు రోజుల్లో గేదె ఈననున్నదని ఈ లోపే ఇలా జరిగిందని వాపోతున్నారు. ఒక్కో గేదె విలువ రూ.లక్ష నుంచి లక్షన్నర వరకూ ఉంటుందని చెప్పారు.

'పది' విద్యార్థులకు నగదు బహుమతులు


నగదు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం సునీతలత, పచ్చల శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని రోటరీ క్లబ్ ఆఫ్ పత్తిపాడు మాజీ ప్రెసిడెంట్ పచ్చల శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన తమలపాకు శ్రీజ, షేక్ షాజియా, కొత్తపల్లి శ్రీలక్ష్మిలకు శనివారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పచ్చల సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పచ్చల శ్రీనివాసరావు విద్యార్థులకు నగదు బహుమతులను హెచ్‌ఎం చేతుల మీదుగా అందించారు. హెచ్‌ఎం సునీతలత, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రత్తిపాడు: పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని ఎంపీడీఓ కె.శివపార్వతి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నిమ్మగడ్డవారిపాలెంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ కె.శివపార్వతి స్థానిక రక్షిత మంచినీటి చెరువు కట్టపై ఉపాధిహామీ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం నీరు–మీరు థీమ్ ప్రోగ్రాంలో భాగంగా ఆయా గ్రామాల్లో నీటి ఆవశ్యకతను వివరిస్తూ గ్రామాల్లో అవగాహన ర్యాలీలు జరిపారు. స్వచ్ఛతా ప్రతిజ్ఞలు చేయించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ ఏడుకొండలు, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ డబ్బూరి శ్రీనివాసరావు, సెక్రటరీ ఖాజా, నిమ్మగడ్డ సతీష్, టీఏ తదితరులు పాల్గొన్నారు.



ఆస్తి గొడవల నేపథ్యంలో దాడి

- తాడేపల్లి సలాం హోటల్ సెంటర్‌లో దారుణం
- బాధితుడి ఇంటిపై దాడి.. ఇల్లు పాక్షికంగా ధ్వంసం
- ఆపై కుటుంబ సభ్యులపై దాడి
- ప్రాణాలు అరచేతిలో పట్టుకుని పరుగులు తీసిన కుటుంబసభ్యులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణంలోని సలాం హోటల్ సెంటర్‌లో శనివారం దారుణం చోటు చేసుకుంది. బాధితుడు వేముల వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. తనకు తన పెదనాన్న కుమారులకు ఆస్తి గొడవలున్నాయని, పాత ఆస్తి గొడవల వివాదం కొనసాగుతుండగా శనివారం తన పెదనాన్న కుమారులు వేముల రమణబాబు, వెంకటేశ్వరరావు, మోహనరావు, శ్రీను శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా తన ఇంటిపై దాడిచేసి ఇంటిపై కప్పురేకులను సైతం ధ్వంసం చేశారన్నారు. కుటుంబసభ్యులపై దాడి చేయడమే కాక భయంతో పరుగులు పెట్టిన కుటుంబసభ్యులను వెంటాడి దాడి చేశారన్నారు. తన తాతకు ఇద్దరు కుమారులు కాగా ఇద్దరికి 12 సెంట్ల స్థలం ఇచ్చారన్నారు. అయితే తనకు ఇచ్చిన స్థలాన్ని విక్రయించిన తన పెదనాన్న కుమారులు తన నివాసంలో వాటా కావాలంటూ శనివారం మధ్యాహ్నం భోజనం చేస్తుండగా ఒక్కసారిగా ఇంటిపై దాడి చేయడంతో తాము భయంతో పరుగులు తీసి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నామని తెలిపారు. అనంతరం గాయాలతో ఆసుపత్రిలో చేరగా ఆసుపత్రి వద్దకు సైతం వచ్చి దాడి చేశారన్నారు. పోలీసులు చేరుకుని వారిలో ఒకరిని అదుపులోకి తీసుకోవడంతో తాను ప్రాణాలతో భయటపడ్డామన్నారు. అయితే ఆ వ్యక్తి పోలీసుల నుంచి పారిపోవడంతో తమకు ఆందోళనగా వుందన్నారు. గతంలోను అనేకసార్లు కేసులు పెట్టినా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం కారణంగానే తమపై దాడికి దిగుతున్నారన్నారు. తిరిగి తమపైనే కేసు పెట్టారన్నారు. పోలీసులు వెంటనే తగు చర్యలు తీసుకుని తమపై దాడి చేసిన వారిని పట్టుకుని శిక్షించి తమకు రక్షణ కల్పించాలని కోరారు.

వర్షపు నీటిని ఒడిసిపట్టాలి

తెనాలిటౌన్: భూగర్భ జలాల సంరక్షణకు వర్షపు నీటిని ఒడిసి పట్టాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని డిప్యూటీ ఎంపీడీవో వైవిడి ప్రసాద్ సూచించారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో శనివారం స్వచ్ఛంధ్ర – స్వర్ణంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్ పాల్గొని నీరు–మీరు ఆవశ్యకతను గ్రామస్తులకు తెలియజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతినెల మూడోవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దీనిలో భాగంగా శనివారం నీరు–మీరు ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పంచాయతీ కార్యాలయం పరిసరాలలో ఇంకుడు గుంతులు ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఓడిసి పట్టేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇంకుడుగుంత ఏర్పాటుకు ప్రభుత్వం లబ్దిదారులు రూ.6 వేలు నగదుసాయం అందిస్తుందని వెల్లడించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిదులు కింద ఈ నగదు చెల్లిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రజలు ఇంకుడు గుంతల ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ దూళ్ళిపాళ్ళ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి హేమకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రావినూతల శ్రీరామమూర్తి జయంతి

తెనాలి: రూరల్ మండల గ్రామం అంగలకుదురుకు చెందిన ప్రముఖ కవి, రచయిత, నటుడు రావినూతల శ్రీరామమూర్తి 74వ జయంతిని శనివారం ఇక్కడి తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. రావినూతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద కళాకారులకు బియ్యం , నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సభకు రంగస్థల కళాకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గరికపాటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. తెనాలికి తొలి నంది బహుమతిని తీసుకొచ్చిన దర్శకుడు శ్రీరామమూర్తి అని ఆయన గుర్తుచేశారు. తెనాలి మాజీ జడ్పీటీసీ శాఖమూరి నారాయణప్రసాద్ (చిన్నా), గణేష్ యూత్ వీరవల్లి మురళి, డాక్టర్ కడియాల వెంకటరమణలు పాల్గొన్నారు.

'కోల్డ్‌స్టోరేజ్' బాధితులకు నగదు పంపిణీకి కమిటీ ఏర్పాటు

తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ



దుగ్గిరాల: నెలాఖరులోగా పసుపు కోల్డ్‌స్టోరేజ్ అగ్ని ప్రమాద బాధితులకు నగదు పంపిణీకి కమిటీ ఏర్పాటు చేసినట్లు తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ తెలిపారు. శనివారం దుగ్గిరాల పసుపు యార్డులో నూతన కమిటీ సభ్యులతో ఆమె సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఆరుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశామని, రూ. 35.47 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. నష్టపోయిన వారికి వారం రోజుల్లో నగదు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వ్యాపారులు తమకు కూడా రైతులతో పాటు పరిహారం ఇవ్వాలని వినతి పత్రం అందించారు, తహసీల్దారు ఐ.సునీత, సెక్రెటరీ జి.వి.సుబ్బారావు, వ్యాపారులు రవీంద్ర నాద్, శ్రీనివాస రావు, నాగార్జున, రంగయ్య, రాంపుల్లయ్య, ప్రసాద్, రవి, తదితరులు పాల్గొన్నారు.